## బీఎస్ఎఫ్ వీరులకు సెల్యూట్

**ప్రజానావ, హైదరాబాద్:**

సరిహద్దులను కాపాడే వీరులకు సెల్యూట్ చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఎస్ఎఫ్ రైజింగ్ డే సందర్భంగా బండి సంజయ్ ఆదివారం ఉదయం స్పెషల్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సిబ్బంది త్యాగాలను ఆయన ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. బీఎస్ఎఫ్ రైజింగ్ డే నాడు, మన దేశ సరిహద్దులను అచంచలమైన సంకల్పంతో కాపాడే వీరులకు సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, సవాల్‌తో కూడిన భూభాగాల్లో వారి కనికరంలేని సేవ దేశం పట్ల వారి నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. అంతేగాక బీఎస్ఎఫ్ సిబ్బంది ధైర్యానికి, త్యాగానికి వందనం అంటూ.. జై హింద్! అని బండి సంజయ్ సోషల్ మీడియా 'ఎక్స్'లో రాసుకొచ్చారు.

## ఏటూరునాగారంలో భారీ ఎన్‌కౌంటర్



(మొదటి పేజీ తరువాయి)

పాపన్నతో పాటు అతడి దళ సభ్యులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో కురుసం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), ఎగోలపు మల్లయ్య అలియాస్ మధు(43), ముస్సకి దేవల్ అలియాస్ కరుణాకర్(22), ముస్సకి జమున (23), జైసింగ్ (25), కిశోర్ (22), కామేశ్( 23) ఉన్నట్లు సమాచారం.

**ఏటూరునాగారం ఏజెన్సీలో ఉద్రిక్తత...**

మావోయిస్టుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఏటూరునాగారం ఏజెన్సీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందగా.. మరో 8 మంది తప్పించుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరి కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతంతో పాటు తాడ్వాయి, గోవిందరావుపేట, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో గాలింపు చర్యలు ఉద్ధృతం చేశారు. ప్రధాన రహదారుల మీదుగా వచ్చి పోయే వాహనాలను నిలిపి సోదాలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మావోయిస్టుల నుంచి ప్రతికార చర్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఏజెన్సీలో ఏం జరుగుతుందో అని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

## కేటీఆర్, హరీశ్‌రావుకు నిద్ర పట్టలేదు..

(మొదటి పేజీ తరువాయి)

గత పదేళ్లలో పూర్తి కాలేదని, ప్రాజెక్టులు అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించాయని చెప్పారు. కేసీఆర్ ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వలేదని, మరో 4050 వేల కోట్ల రూపాయల ఖర్చు చేస్తే ప్రాజెక్టులు పూర్తి అవుతాయని తెలిపారు. ఇప్పటివరకు 2030 శాతం మాత్రమే ప్రాజెక్టుల పనులు జరిగాయని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ గొప్ప పాలన చేస్తే పది లక్షల కోట్ల రూపాయల అప్పులు ఎందుకు అయ్యాయని జూపల్లి కృష్ణారావు నిలదీశారు. నెలకు ఆరువేల కోట్ల రూపాయలు వడ్డీలు కట్టాల్సి వస్తుందని తెలిపారు. రింగురోడ్డును అమ్ముకున్నారని, గత పాలనలో మంత్రులకు ప్రగతి భవన్‌లోకి ఆహ్వానం లేదని చెప్పారు. సెక్రటేరియట్లోకి ఎమ్మెల్యేలకు అనుమతి లేదని, ప్రతిపక్ష పార్టీల గారడీలో ప్రజలు పడకుండా ఉండాలని అన్నారు. కాంగ్రెస్ పాలన దేశానికి, రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని చెప్పారు.

# సంక్రాంతి తర్వాత రైతు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

అప్పు లతో కేసీఆర్‌కు యూపీఏ ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఇప్పుడు రూ.7 లక్షల కోట్ల అప్పు రాష్ట్రంపై ఉందన్నారు. నాడు ప్రజలకు వాస్తవాలు ఎవరూ చెప్పలేదు.. పాలకులు వివరించలేదన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు అడిగితే ప్రతిదాడి చేశారన్నారు. డిసెంబరు 9న అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. రూ.6500 కోట్లు నెలకు అసలు, వడ్డీ ప్రభుత్వం కడుతోందన్నారు. నెల నెలా అప్పులు కడుతూనే సంక్షేమ కార్యక్రమాలు ఆపడం లేదన్నారు. నేతల తలరాతలు మార్చేది రైతులేనన్నారు. నెహ్రూ నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి వరకు రైతు సంక్షేమం కోసం పని చేశారన్నారు. అయిన రైతుల తలరాతలు బాగుపడలేదన్నారు. కేసీఆర్ ఎగ్గొట్టిన రైతుబంధును మేమే ఇచ్చామన్నారు. రూ.7725 కోట్ల రైతు బంధు మొదటి విడత ఇచ్చామని.. 22 లక్షల22వేల 67 మందికి రుణమాఫీ చేశామన్నారు. 30.5.24 న రెండో విడత రుణమాఫీ చేశామని.. మూడోసారి 4లక్షల 46వేల 836మందికి మాఫీ చేశామన్నారు. నిన్న రూ.2,747 కోట్లు నాల్గో విడతగా సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో ఆగిపోయిన వారికి మాఫీ చేశామన్నారు. మొత్తంగా 25 లక్షల 36 వేల 964 రైతు కుటుంబాలకు రూ. 20, 616 కోట్లు రుణమాఫీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఎవరు చేయలేదని.. దేశంలోనే ఇది గొప్ప రికార్డు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయినా బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తూ తామే గొప్పగా రుణమాఫీ చేశామని చెబుతున్నారన్నారు. రైతులు అప్పులు చేసి మిత్తిలు కట్టారని.. రుణమాఫీ కాక ఇబ్బందులు పడ్డారన్నారు. 20 లక్షల మంది కొత్తగా రుణాలు తీసుకోలేదని.. పాత వాటినే రెన్యూవల్ చేసుకున్నారన్నారు. మాది రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు.



రైతు బంధు బకాయిలు ఇచ్చామన్నారు. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు బంధు వేస్తామన్నారు. మారీచుడు, సుబాబులు వచ్చి అడ్డుకున్నా.. రైతు భరోసా వేస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రూపంలో మారీచులు వస్తారని... ఎవరు ఆందోళన చెందవద్దని, ఎవర్ని నమ్మవద్దన్నారు. భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని, నివేదికను సభలో పెట్టి చర్చిస్తామన్నారు. డిసెంబర్ లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి రైతు భరోసా వేస్తామన్నారు. సన్న బియ్యానికి 500 రూపాయల బోనస్ ఇచ్చామన్నారు. గతంలో వరి వేసుకుంటే ఉరే అని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారని.. ఆ పరిస్థితి నుంచి వరి వేసుకుంటే.. అందులో సన్నాలు వేసిన వారికి 500 రూపాయల బోనస్ ఇచ్చామన్నారు. ఉచిత కరెంటు ఇస్తామని చెప్పి ఇచ్చామని... ఎవరు వచ్చినా ఉచిత విద్యుత్ ఇవ్వక తప్పని పరిస్థితి ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూడా సన్నాలకు బోనస్ కొనసాగుతుందన్నారు. తెలంగాణలో తెలంగాణ సోనా, బీపీటీ, హెచ్ఎంటీ బియ్యాన్ని ఎక్కువగా తింటారన్నారు. విద్యార్థులకు తెలంగాణ నేల మీద పండిన బియ్యాన్ని అందిస్తామన్నారు. రైతులు నాణ్యమైన సన్నాలు పండిస్తే పేదలకే అందిస్తామన్నారు. పథకాలు అమలు చేస్తున్న విధానం కూడా ప్రజలకు, రైతులకు తెలియాలన్నారు. ఇది రాజకీయాలు చేసే సందర్భం కాదన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రజల్లోకి వెళ్ళాలన్నారు. వ్యవసాయం దండగ కాదు పండుగ చేస్తామన్నారు. కిషన్ రెడ్డికి తెలంగాణతో ఏం సంబంధమని ప్రశ్నించారు. గుజరాత్‌లో అన్ని రకాల మద్యం బ్రాండ్లు దొరుకుతాయన్నారు. బీజేపీ గడిచిన మూడు పర్యాయాల మేనిఫెస్టోలతో ముందుకు వస్తే మేము మా మ్యానిఫెస్టోలతో చర్చకు సిద్ధమన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

# 6 అబద్ధాలు.. 66 మోసాలు

**ప్రజానావ, హైదరాబాద్:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ గ్యారెంటీలపై బీజేపీ తాజాగా చార్జిషీట్ విడుదల చేసింది. 'కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ: 6 అబద్ధాలు, 66 మోసాలు' పేరుతో ఈ చార్జిషీట్ రూపొందించారు. దీనిపై తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. 100 రోజుల్లో గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీని ఈ ఏడాది కాలంలో నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ పాలనపై ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని కిషన్ రెడ్డి తెలిపారు. ఏమీ చేయకుండానే, కాంగ్రెస్ జరుపుకుంటున్న విజయోత్సవాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని వ్యాఖ్యానించారు. విజయోత్సవాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సంబరాలు చేసుకోవడమేంటని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.



రేవంత్ భాష మార్చుకుంటే మేం చర్చకు సిద్ధం...

సీఎం రేవంత్‌రెడ్డి భాష మార్చుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై చర్చకు తాను సిద్ధమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. 'కేసీఆర్ లాగా అదే భాష కాకుండా.. నిర్మాణాత్మక అంశాలపై మేము చర్చకు సిద్ధం. కుల గణనను మేము వ్యతిరేకించడం లేదు. జాబ్ క్యాలెండర్ ప్రకారం.. గ్రూప్ 1, 2, 3, 4 నియామకాలు ఎప్పుడో పూర్తవ్వాలి. ఇప్పటి వరకు ఫస్ట్ ఫేస్ కూడా పూర్తికాలేదు. షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు ఏదీ పూర్తవ్వలేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. భూసేకరణ చేపట్టవద్దని కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేశారు. కాంగ్రెస్ కూడా భూసేకరణ చేపట్టే సమయంలో పద్ధతి ప్రకారం చేయాలి.. రైతులతో మాట్లాడి పరిష్కారం చేసుకోకుండా రైతులపై దాడులా.. ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వం నడుచుకోవాలి. ఫామ్ హౌజ్‌లో ఉన్న కేసీఆర్‌తో కాంగ్రెస్ సంబంధాలు పెట్టుకుంది. కేసీఆర్ పుట్టిందే కాంగ్రెస్‌లో.. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు. రేవంత్ దృష్టిలో ఆయన్ను ప్రశ్నించే వారు.. వార్తలు రాసేవారు కూడా మానవ మృగాలే. కాంగ్రెస్ మేనిఫెస్టో అమలుకు ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకోవాలో కూడా రోడ్డు మ్యాప్ లేదు' అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

# బూటకపు వాగ్దానాలు.. బూటకపు ఎన్‌కౌంటర్లు

**ప్రజానావ, హైదరాబాద్:**

రేవంత్ సర్కారుపై బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. విజయోత్సవాలు అంటూ ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు ఏంటని ప్రశ్నించారు. ములుగు జిల్లాలో తాజాగా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ నేపథ్యంలో హరీష్‌రావు చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఏడాది విజయోత్సవాలు ప్రభుత్వం నిర్వహిస్తుంటే.. ఈ బూటకపు ఎన్ కౌంటర్ ఏంది? అని మాజీమంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. అరెస్టులు, నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు ఒకవైపు, బూటకపు ఎన్ కౌంట్లర్లు మరోవైపు రాష్ట్రంలో అశాంతిని రేపుతున్నాయని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాలను మోసం చేసి ఆరు గ్యారెంటీలను అటకెక్కించారని విమర్శించారు. ఏడో గ్యారెంటీగా డబ్బా



కొట్టిన ప్రజాస్వామ్య పాలనకు సైతం విజయవంతంగా తూట్లు పొడిచారని ఎద్దేవా చేశారు. బూటకపు వాగ్దానాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు అంటూ ట్వీట్ చేశారు.

# ఏఈఈ నిఖేష్ కుమార్‌కు 14 రోజుల రిమాండ్

**ప్రజానావ, హైదరాబాద్:**

గండిపేట మండలం పీరంచెరువు పెబెల్‌సిటీ గేటెడ్ కమ్యూనిటీలోని నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిఖేశ్ కుమార్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిఖేష్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు న్యాయమూర్తి నివాసంలో హాజరుపర్చారు. ఈ క్రమంలో నిఖేశ్ కూమార్‌కు జడ్జి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. అనంతరం ఏసీబీ అధికారులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ అధికారుల సోదాల్లో నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. నిఖేష్ కుమార్ ఇంటితో పాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లు మొత్తం 20 వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. దాదాపు రూ. 200 కోట్లకు పైగా విలువగల ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. నిఖేశ్ కుమార్‌కు కొల్లూరులో 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మొయినాబాద్‌లో మూడు ఫాంహౌజ్‌లు, మూడు విలాసవంతమైన విల్లాలు ఉన్నాయి. తన ఎస్బీఐ అకౌంట్ ద్వారా నిఖేష్ కుమార్ కోట్ల రూపాయల లావాదేవీలు జరిపాడు. అనేక మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులతో నిఖేష్ కుమార్‌కు మంచి సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఆరు నెలల క్రితం లంచం తీసుకుంటూ నిఖేష్ కుమార్ పట్టుబడ్డాడు. అతని వద్ద ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఏసీబీ రైడ్ చేసింది. ఆ సమయంలో రూ. 100 కోట్లకు పైగా విలువ చేసే అక్రమాస్తులు బయటపడ్డాయి. అప్పుడు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు అధికారులు. 2 నెలల తర్వాత బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చాడు. అప్పటి కేసులో మళ్లీ



తాజాగా తీగ లాగారు. దీంతో కళ్లు తేరేసే రీతిలో అక్రమాస్తులు బయటపడ్డాయి. తాజాగా మరోసారి ఆయన్ను అరెస్ట్ చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. గండిపేట చెరువు అక్రమ నిర్మాణాలలో నిఖేష్ పాత్ర ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే.. బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాడు. నిఖేష్ కుమార్ గండిపేట ఇరిగేషన్ ఏఈఈగా పనిచేశాడు. ఈ క్రమంలో ఉస్మాన్ సాగర్ (గండిపేట) చెరువును కాపాడాల్సిన నిఖేష్.. నిర్మాణాలకు అనుమతి ఇచ్చాడు. చెరువు, ఎఫ్టీఎల్ బఫర్‌లను కబ్జా చేస్తుంటే చూసి చూడనట్టు వదిలిపెట్టాడు. కోకాపేట, గండిపేట, నార్సింగ్, మంచి రేవుల అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇచ్చాడు. ఈ ప్రాంతంలో బుల్కాపూర్ నాళా, మూసి పరిధిలో అపార్ట్మెంట్, విల్లాలు అనుమతి ఇచ్చాడు. నిఖేష్ ప్రముఖ కంపెనీలకు అనుమతి ఇచ్చి షేర్లు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు.

## ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జై షా




**ముంబై/దుబాయ్:**

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి అయినప్పటికీ, భారత క్రికెట్ దశ దిశ అన్నీ తానై నడిపిస్తున్న జై షా... ఇప్పుడు ఐసీసీ పీఠాన్ని అధిష్ఠించారు. ఐసీసీ నూతన చైర్మన్ గా ఆయన ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. జై షా ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. ప్రస్తుతం జై షా వయసు 35 ఏళ్లు కాగా.. ఐసీసీ చైర్మన్ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా ఘనత అందుకున్నారు. అంతేకాదు, ఐసీసీ పీఠం ఎక్కిన ఐదో భారతీయుడు జై షా. ఇప్పటి వరకు ఐసీసీలో భారత్ కు ప్రముఖ స్థానం దక్కుతూ వస్తోంది. గతంలో జగ్మోహన్ దాల్మియా (1997 2000), శరద్ పవార్ (201012) ఐసీసీ అధ్యక్షులుగా పనిచేయగా... ఎన్ శ్రీనివాసన్ (201415), శశాంక్ మనోహర్ (20152020) ఐసీసీ చైర్మన్లుగా వ్యవహరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనయుడైన జై షా... 2009లో క్రికెట్ పాలనా వ్యవహారాల్లో తన ప్రస్థానం ప్రారంభించారు. గుజరాత్ క్రికెట్ సంఘం సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన షా... అహ్మదాబాద్ లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంను నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. 2019లో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగానూ, ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల కమిటీ చైర్మన్ గానూ వ్యవహరించారు. కాగా, 2020 నవంబరు నుంచి ఐసీసీ చైర్మన్ గా గ్రెగ్ బార్ క్లే వ్యవహరించారు. ఇప్పుడు బార్ క్లే స్థానంలో జై షా ఐసీసీ పగ్గాలు అందుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యున్నత పదవిని చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని జై షా తెలిపారు. తనకు మద్దతిచ్చిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు, సభ్య దేశాల క్రికెట్ బోర్డులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు.


# ప్రతి ఎకరానికి సాగు నీరందిస్తాం..

**ప్రజానావ, కరీంనగర్:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌరసరఫరాల శాఖ విభాగంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండించారన్నారు. గతంలో ఎక్కడా లేని విధంగా సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతులకు ఎక్కడా తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు రికార్డు సమయంలో వడ్ల డబ్బులు పడ్తున్నాయన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తికరంగా ఉందన్నారు. డిసెంబర్ 4న సీఎం పర్యటన ఉన్న సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు



చేసి రైస్ మిల్లులకు తరలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే గంటల వ్యవధిలో రైతులకు మద్దతు ధర, బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సమయానికి 100 శాతం ధాన్యం డబ్బులు చెల్లించి ఉండాలని ఆదేశించారు. సన్న రకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అధికంగా కొనుగోలు చేయాలని, ప్రైవేట్ వ్యాపారులు ఎక్కడ 2800 కంటే తక్కువ ధరతో సన్న రకం ధాన్యం కొనుగోలు చేయకుండా చూడాలన్నారు. రాబోయే సంవత్సరంలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగా కనీసం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర గడిచిన నేపథ్యంలో డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తమ ప్రభుత్వం 10 నెలల కాలంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ ప్రైవేట్ సంస్థలో యువత ఉపాధి పొందేలా అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. సీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పత్తిపాక రిజర్వాయర్ 2950 కోట్లతో 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు ప్రాథమిక అంచనాలు తయారు చేశామన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం 95 శాతం పూర్తయిందని, డిసెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నుంచి రైతులకు సాగు నీరు అందించాలని, పాలకుర్తి ఎత్తిపోతల పథకం ప్రతిపాదనలు, నీటి కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు లోని ప్యాకేజ్ 9 పెండింగ్ పనులు, చిన్న కాళేశ్వరం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ ప్రైవేట్ సంస్థలో యువత ఉపాధి పొందేలా అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. సీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పత్తిపాక రిజర్వాయర్ 2950 కోట్లతో 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు ప్రాథమిక అంచనాలు తయారు చేశామన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం 95 శాతం పూర్తయిందని, డిసెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నుంచి రైతులకు సాగు నీరు అందించాలని, పాలకుర్తి ఎత్తిపోతల పథకం ప్రతిపాదనలు, నీటి కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు లోని ప్యాకేజ్ 9 పెండింగ్ పనులు, చిన్న కాళేశ్వరం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.



# చర్చకు మేం సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చి ప్రతి అకౌంట్ కు 15 లక్షల రూపాయలు వేస్తాం అన్నారు. వంద రోజుల్లో అన్ని రకాల ధరలు తగ్గిస్తాం అన్నారు.. డాలర్ కు పోటీగా రూపాయి విలువ పెంచుతామని అన్నారు. 50 రూపాయలకే లీటర్ పెట్రోల్ అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతాం అన్నారు.. ఏమయ్యాయి?. దేశంలో వందలాది మంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీజేపీలోకి మార్చారు. దేశంలో 45 ఏళ్లలో లేని నిరుద్యోగ పరిస్థితిని కల్పించారు. మతతత్వ రాజకీయాలు చేస్తూ.. పార్టీలను చీలుస్తూ రాజకీయ పబ్బం గడిపిన బీజేపీ ఇప్పుడు సుద్దాపూస మాటలు మాట్లాడుతుంది. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే. మొన్నటి పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్‌తో చీకటి ఒప్పందం చేసకోవడంతో రాష్ట్రంలో బీజేపీ ప్రతిష్ట పూర్తిగా దిగజారింది. కాబట్టే రాష్ట్రంలో ఇలా ఛార్జ్‌షీట్ పేరుతో రాజకీయాలు చేస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్ కవల పిల్లలు. ఒకరికొకరు ఒకరికొకరు ఏ టీం, బీ టీంగా వ్యవహరిస్తారు. ఇది అనేక సార్లు రుజువైంది. సార్వత్రిక ఎన్నికల్లో రహస్య ఒప్పందం జరిగింది. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ మోదీ గ్యారెంటీ పేరిట ప్రజలను మభ్య పెట్టి మోసం చేసింది. 2014 నుంచి 2024 వరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎన్నిసార్లు పెంచారు? దీనిపైన చర్చించడానికి సిద్ధమా?. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఈ పది సంవత్సరాల కాలంలో తెలంగాణకు ప్రత్యేకంగా ఏం చేసిందో చర్చించడానికి బీజేపీ నాయకులు సిద్ధమా?. రైతుల సంక్షేమం కోసం ఒక్క సంవత్సర కాలంలోనే దాదాపు రూ. 54 వేల కోట్లు కాంగ్రెస్ ఖర్చు చేసింది. దీనిపై చర్చిద్దామా? దీంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు బీజేపీకి కనిపించడం లేదా' అని ప్రశ్నించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## పట్టణ భీమేశ్వర మేదరి సంఘం ఆధ్వర్యంలో రాకేశ్‌కు సన్మానం

**ప్రజానావ, వేములవాడ:**

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నియామకమైన కనికరపు రాకేశ్ ను పట్టణ భీమేశ్వర మేదరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వర మేదరి సంఘం అధ్యక్షుడు కనికరపు దేవయ్య, ప్రధాన కార్యదర్శి కనికరపు వెంకటేశం, ఉపాధ్యక్షుడు కనికరపు అరవింద్, కోశాధికారి కనికరపు తిరుపతి, ప్రచార కార్యదర్శి కనికరపు అనిల్, కనికరపు రాజనర్సు, కనికరపు రాజయ్య, గుల్ల రాజయ్య, కనికరపు లచ్చయ్య, కనికరపు రవి, కనికరపు రాజశేఖర్ పాల్గొన్నారు.

## నగరంలో కుటుంబ సర్వే పూర్తి

**ప్రజానావ, కరీంనగర్ :**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తయ్యింది. అధికారులు, ఉద్యోగులు వందశాతం లక్ష్యాన్ని సాధించారు. ఇంటింటా కుటుంబాల గుర్తింపు సందర్భంగా వేసిన స్టిక్కర్ల ప్రకారం వివరాలను నమోదు చేసుకున్నారు. ఆ సమయంలో ఇళ్లల్లో లేని వారు, తాళం వేసిన ఇళ్లకు వెళ్లి కుటుంబ యజమానుల వివరాలను కూడా తర్వాత నమోదు చేసుకున్నారు. కొందరు ఉద్యోగులు సర్వే వివరాలు అందించకపోవడంతో వారి పేర్లను ప్రత్యేకంగా నమోదు చేసుకున్నారు. మరికొందరు నగరంలో అద్దెకు ఉండి, గ్రామీణ ప్రాంతాల్లో, సొంతూరులో ఉన్న అక్కడ రాయించుకున్నామనే సమాధానం వచ్చిందని ఎన్యుమరేటర్లు చెప్పారు.

**కాల్ సెంటర్ సమాచారంతో..**

కుటుంబ సర్వే సందర్భంగా తప్పిపోయిన ఇళ్లను, సర్వే సిబ్బంది రానట్లైయితే కాల్ సెంటర్ ద్వారా సమాచారం ఇవ్వాలని నగరపాలక కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. ఈ మేరకు సుమారు 60 ఇళ్ల నుంచి సమాచారం రావడంతో క్షేత్రస్థాయిలో వెళ్లి వివరాలను సేకరించారు.

# మానసికోల్లాసానికి, దేహదారుఢ్యానికి క్రీడలు అవసరం

**సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 2కె రన్ నిర్వహించిన జిల్లా కలెక్టర్**




**ప్రజానావ, సిరిసిల్ల:**

క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహద పడతాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ప్రజా పాలన ఏడాది అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు సీఎం కప్ పోటీల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం 2కే రన్ పోటీలు నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ దాకా 2కే రన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అధికారులు విద్యార్థులు యువతతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల వేడుకలను ప్రభుత్వం పండగ వాతావరణం లో ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా సిరిసిల్ల జిల్లాలో 2 కే రన్ నిర్వహించామని అన్నారు.2కే రన్ లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను, యువతను కలెక్టర్ అభినందించారు.విద్యార్థులు, యువత చదువుతోపాటు, ప్రతి రోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని పిలుపు నిచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. క్రీడాకారులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీ.ఈ.ఓ. రమేష్ కుమార్, డీ.వై.ఎస్.ఓ. రాందాస్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య, పీ.డీలు, పీ.ఈ.టీ.లు, వాలీ బాల్ అకాడమీ క్రీడాకారులు, యువతీ యువకులు , ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, మహిళా సంఘాలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ 4న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సాంస్కృతిక కార్యక్రమం నిర్వహణ

**ప్రజానావ, సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణంలో డిసెంబర్ 4న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా ప్రొఫెసర్ అలేఖ్య పుంజుల, చైర్పర్సన్ తెలంగాణ సంగీతా నాటక ఆకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యం లో నిర్వహించు "జయ జయహే ప్రజా పాలన" సాంస్కృతిక కార్యక్రమాలు. నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా డిసెంబర్ 4న ప్రొఫెసర్ అలేఖ్య పుంజుల, చైర్పర్సన్ తెలంగాణ సంగీతా నాటక ఆకాడమీ హైదరాబాద్ వారి కళా బృందం సారథ్యంలో సిరిసిల్ల ప్రాంతానికి విచ్చేసి వివిధ కళా రూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సర కాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళా ప్రదర్శనలు చేయడం జరుగుతుందని అన్నారు. సిరిసిల్ల పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలోనీ డా. సి నారాయణ రెడ్డి కళా క్షేత్రం లో డిసెంబర్ 4 న సా.6.00 గంటలకు ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతారని, యువతీ యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఐఎంఏ సేవలు అభినందనీయం

**ప్రజానావ, రుద్రంగి :**

ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కొనియాడారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఎంఏ ఆద్వర్యంలో విప్ ను సన్మానించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడారు. ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఉచితంగా పరీక్షలు మందులు అందజేస్తున్నారని వివరించారు. ప్రజలకు అందుబాటులోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడాన్ని అభినందించారు.

**500 మంది పేషెంట్స్ కి సేవలు**

ఈ క్యాంపులో సుమారు 500 మంది పేషెంట్స్ కి రాజన్న సిరిసిల్ల ఐఎంఏ డాక్టర్ల బృందం ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చికోటి సంతోష్ కుమార్, సెక్రటరీ డాక్టర్ అభినయ్, ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ లీల శిరీష, డాక్టర్ శోభారాణి, డాక్టర్ పి తిరుపతి, డాక్టర్ ఆర్ తిరుపతి, డాక్టర్ అనిత, డాక్టర్ ఆర్ ప్రవీణ్, డాక్టర్ అనంత్ బృందం ఐఎంఏ పి ఆర్ ఓ భాస్కర్ గారు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో సాధారణ వైద్య నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, స్త్రీల సంబంధిత వైద్య నిపుణులు, ఆర్థోపెడిషన్ జనరల్ సర్జన్ వారు వైద్య సేవలు అందించారు. ఉచిత పరీక్షలు సి బి పి, ఆర్ బి ఎస్, ఈ సి జి లాంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కు ఘన సన్మానం



**ప్రజానావ,కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎన్నికైన తాళ్లపల్లి ప్రభాకర్‌ను మాజీ సర్పంచులు మాట్ల అశోక్, కొమ్ము దేవరాజ్, శాలువాలతో ఆదివారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను అలంకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొర్ర స్వామి, తాళ్లపల్లి దేవరాజు, జీవన్, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది





**ప్రజానావ, కోనరావుపేట:**

ముదిరాజ్ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్,అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావు పేట మండల కేంద్రంలో నిర్వహించిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, ముదిరాజ్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముదిరాజ్ కుల పెద్దలందరూ కలిసి ఆది శ్రీనివాస్,ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముదిరాజ్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం 50 కోట్ల నిధులు కేటాయిస్తూ ముదిరాజుల అభివృద్ధికి ప్రణాళికలు వేస్తుందని అన్నారు. ముదిరాజ్ కులస్తుడు తెలంగాణ ఉద్యమకారుడు కానిస్టేబుల్ కిష్టయ్య, వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ముదిరాజ్ కులస్తులందరూ ఈరోజు రాజకీయ ఆర్థిక ఉపాధి విద్య లో అవకాశాలు కావాలని కోరుతున్నారని వారందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలాగునా కృషి చేస్తానని చదువుకునే బిడ్డలందరికీ ప్రజా పాలనలో ప్రతి మండలానికి ప్రభుత్వం 25 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ లను త్వరలో కేటాయిస్తుందని ప్రతి ఒక్కరికి చదువు అందేలా కృషి చేస్తానని విద్యతోనే ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందుతారని అన్నారు.రాహుల్ గాంధీ భారతదేశంలో పాదయాత్ర చేస్తూ చాలామంది వెనుకబడి ఉన్నారని గుర్తించి ఎవరి వాటాలు వారికి అందాలని అసమానతలు తొలగించే విధంగా కులగనన చేయాలని ఆనాడే చెప్పారని ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగనన చేసి విద్యా ఉపాధి రాజకీయంగా అన్ని వాటాలను ప్రజలకు సమానంగా పంచే విధంగా రూపకల్పన చేస్తుందని ప్రభుత్వ పథకాలు అందరికీ సమానంగా అందుతాయని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ రంగంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ముదిరాజులను బిసిడి నుండి బీసీఏ లోకి మార్చే విధంగా తన వంతు సహాయం చేస్తానని అన్నారు.మల్కపేట రిజర్వాయర్ ను త్వరలోనే మూడు టీఎంసీల నీటితో నింపి ప్రభుత్వం ద్వారా చేప పిల్లలను వదిలి ఉపాధి ఉండేలాగా చూస్తానని ప్రభుత్వం నుండి తేప్పలు, వలలు,స్కూటీలు అందేలాగా కృషి చేస్తానని అలాగే మండల కేంద్రంలో ముదిరాజుల సంఘ భవన నిర్మాణానికి 10 లక్షలు మంజూరు చేస్తున్నామని అన్ని కులాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కీసరి శ్రీనివాస్, జిల్లా మత్స్య సహకార సంఘంవైస్ చైర్మన్ అంబటి శేఖర్, మండల అధ్యక్షుడు బోయిని లింబాద్రి,గండి నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

## నూకలమర్రి గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు



**ప్రజానావ, వేములవాడ :**

గత ప్రభుత్వం హామీ ఇచ్చి నేరవేర్చకపోయినా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి రూ.2.33కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేశారు. నూకలమర్రి ప్రజలతో పాటు చుట్టూ గ్రామాల ప్రజల ఏళ్ల కల నెరవేరిందని తాజా మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విప్, ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువతో సన్మానించారు.






# ఘనంగా ప్రజా పాలన క్రీడా విజయోత్సవాలు

**పలు జిల్లాల్లో 2కే రన్ కార్యక్రమాలు**

**ప్రజానావ, ఆర్మూర్:**

ప్రజాపాలన క్రీడా విజయోత్సవాల్లో భాగంగా ఈరోజు తెలంగాణ వ్యాప్తంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు యాడాది పూర్తికావస్తున్న సందర్భంగా ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా విజయోత్సవాల పేరిట ఈ కార్యక్రమాలు రూపొందించారు.నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో జరిగిన 2కే రన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి పాల్గొన్నారు. దీనితోపాటు వివిధ జిల్లా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో యువ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .ఆర్మూర్ పట్టణంలో జరిగిన 46వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలికల హ్యాండ్ బాండ్ ఛాంపియన్షిప్ 2024 కార్యక్రమంలో పాల్గొన్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, ఒక్క ఏడాది కాలంలోనే తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో సమూలమైన మార్పులు సంభవిస్తున్నాయని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రీడలకు చారిత్రాత్మక బడ్జెట్ ను కేటాయించిక్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు.
నూతన క్రీడా విధానము, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, పలు జాతీయ అంతర్జాతీయ పోటీలకు తెలంగాణను వేదికగా మార్చడంతో పాటు ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ 2024 నిర్వహించి గ్రామీణ స్థాయి నుంచి అంచలంచలుగా తెలంగాణ క్రీడారంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన అన్నారు.

డిసెంబర్ 7 నుండి గ్రామీణ స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం కాబోతున్నాయని, ఇందు కొరకు మొట్టమొదటిసారిగా ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొనే ప్రతి ఒక్క క్రీడాకారుడి సమాచారం పొందుపరిచే విధంగా సమాచార వ్యవస్థను రూపొందించామని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఉన్న యావత్ క్రీడాకారుల సమాచారం ఒక్క చోట చేర్చే విధంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.




# వేడుకగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజానావ,కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూర్, గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.1995-96 బ్యాచ్ 7 వ తరగతి విద్యార్థులు 25 ఏళ్లు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. 30 మంది పూర్వ విద్యార్థులు అందరు ఒకే వేదికపై కలుసుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం దివంగతులైన విద్యార్థులు రాము, కొండల్ రెడ్డి ల ఆత్మశాంతి కోసం నివాళులర్పించారు. అప్పటి ఉపాధ్యాయులు లక్ష్మణ్, సత్యనారాయణ, కృష్ణ మూర్తి లకు పూర్వ విద్యార్థులు పాదాభివందనం చేసి శాలువా, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు.

# అటవీ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజానావ, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్, గ్రామంలో అటవీశాఖ అధికారులు ప్రజలకు అడవి వన్యప్రాణుల సంరక్షణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చందుర్తి మల్యాల రెంజ్ అటవీ క్షేత్ర అధికారి ఎండి ఖలీలోద్దిన్ హాజరై అడవి యందు సంబవించే అగ్ని ప్రమాదాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వన్యప్రాణులను సంరక్షించే విధానంపై, ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బావితరాలు బాగుండాలంటే అటవీ సంపద సంరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ పల్లె శ్రీనివాస్, బీట్ అధికారులు సుదర్శన్, అభిషేక్ రావు, బేస్ క్యాంపు సిబ్బంది బలరాం,సతీష్, వాచర్లు కాశయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# రాజన్న ఆలయంలో వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజానావ, వేములవాడ:**

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు రాజన్న ఆలయ కళావేదిక ప్రాగణంలో ఆదివారం సామూహిక కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ఏఈవోలు శ్రవన్‌కుమార్ , జీ.అశోక్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా కరీంనగర్ వాస్తవ్యులు ఎం.వెన్నెల భక్తి సంగీతం, డా.ఎస్. భారతి అలిండియా రేడియో వారిచే శివలీల హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సుహాసినీలచే సామూహిక కార్తీక దీపోత్సవం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



## 349 మంది కానిస్టేబుళ్లు కమిషనరేట్‌కు కేటాయింపు

**ప్రజానావ,కరీంనగర్:**

పోలీసు శాఖలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు 349 మందిని కరీంనగర్ కమిషనరేట్‌కు కేటాయించారు. శనివారం వీరందరూ కమిషనరేట్లో రిపోర్టు చేశారు. వీరిలో 245 మంది పురుషులు, 104 మంది మహిళలు ఉన్నారు. సివిల్‌లో 150 మంది పురుషులు, 86 మంది మహిళలు, ఏఆర్ విభాగంలో 95 మంది పురుషులు, 18 మంది మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా పరేడ్ మైదానంలో కానిస్టేబుళ్లతో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి మాట్లాడారు. వీరిలో విద్యావంతులు అనేక మంది ఉన్నారని, సాంకేతిక అంశాలను అందిపుచ్చుకోవాలన్నారు. సీనియర్ల సలహాలతో, శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని విధి నిర్వహణలో చూపాలన్నారు. ఠాణాలు కేటాయించిన వారు రిపోర్టు చేయాలని సూచించారు. అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

# ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

**రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి**

**పలు రెసిడెన్షియల్ విద్యాలయాల పరిశీలన**

**ప్రజానావ, ఇల్లంతకుంట:**

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలోని బాలుర వసతి గృహం, ఇల్లంతకుంటలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హాస్టల్ ఆవరణ, పరిసరాలు, అనంతరం వసతి గదులు, కిచెన్, స్టోర్ రూంలో ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు పరిశీలించారు. అనంతరం ఆయా విద్యాలయాల్లో విద్యార్థులతో ఆకునూరి మురళి సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోని తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. పోటీ పరీక్షలలో రాణించేలా విద్యార్థులను తీర్చిద్దాలని ఉపాధ్యాయులకు పేర్కొన్నారు. ఈ పర్యటనలో డీఈఓ రమేష్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.









ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన మాలలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ తో సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్ లో జరుగుతున్న మాల సింహగర్జనకు తరలివెళ్లారు. ఈ బైక్ ర్యాలీకి మెట్టుగూడ కార్పొరేటర్ సునీత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలు ఏకతాటిపై ఉన్నారని ఈ మాల సింహగర్జన తెలియజేస్తుందన్నారు. మాలల సింహగర్జనకు లక్షల మంది హాజరు కాబోతున్నారని, సభ విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

- ప్రజానావ, సికింద్రాబాద్

# సర్వే ఫారం ఫార్మట్ మార్చండి

- హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలి
- విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి
- విశ్వబ్రాహ్మణ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు పొలాస నరేందర్

**ప్రజానావ, వేములవాడ:**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 75,76,77,78,79 కాలాల్లో విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) కులం బదులుగా (కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, కంసాలి) కులవృత్తులుగా చూపించారని, దీంతో విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) లు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉపాధి పరంగా అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందని విశ్వబ్రాహ్మణ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు పొలాస నరేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఐదు కుల వృత్తులను విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) కులంగా గుర్తించాలని గత నెల 29న హైకోర్టు ప్రభుత్వానికి సూచించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేసి కుటుంబ సర్వేలో ఈ ఐదు వృత్తులవారిని విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) పరిగణలోని తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మాట్ సవరించాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, బీసీ కమిషన్ కమిటీ, బీసీ మంత్రితో పాటు ప్రభుత్వానికి ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించామని నరేందర్ గుర్తుచేశారు. రోజురోజుకు అంతరిస్తున్న విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. అలాగే ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

### వారి వివరాలు మళ్లీ సేకరించాలి

రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 6 నుంచి 26 వరకు చేపట్టిన ఇంటింటా కుటుంబ సమగ్ర సర్వేలో, సర్వేకు సంబంధించిన ఎన్యూమరేటర్లు వచ్చిన సమయంలో డోర్ లాక్ ఉండడం వలన కొంతమంది కుటుంబాల వివరాలను సేకరించలేకపోయారు. డోర్ లాక్ వలన తప్పిపోయిన వారి సమాచారాన్ని సేకరించేందుకు మరోసారి సమయం కేటాయించాలని, అలా అయితేనే సమగ్ర కు టుంబ సర్వే పారదర్శకంగా, పటిష్టవంతంగా జరిగినట్లు ఉంటుందన్న అభిప్రాయాన్ని నరేందర్ వ్యక్తం చేశారు. వీరికి అవసరమైతే ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.





ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..










# వంట గ్యాస్ వినియోగానికి పంచ సూత్రాలు

## జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు ఉండవు

### మన వంటగది.. మన బాధ్యత కార్యక్రమంలో ఎల్పీజీ సేల్స్ చీఫ్ మేనేజర్ లలిత

**ప్రజానావ, సిరిసిల్ల:** వంట గ్యాస్ వాడకంలో ఐదు సూత్రాలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఎల్పీజీ సేల్స్ చీఫ్ మేనేజర్ పీవీ లలిత సూచించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో ఎల్పీజీ వినియోగంలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'మన వంటగది మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వంటల పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ లలిత మాట్లాడుతూ గ్యాస్ వినియోగంలో ఐదు సూత్రాలు పాటిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. సిలిండర్ డెలివరీ సమయంలో తనిఖీ చేసుకోవాలన్నారు. సిలిండర్ కంటే ఎత్తులో పొయ్యి ఉండేలా చూసుకోవాలన్నారు. పొయ్యి వెలిగించిన సమయంలో వంట పూర్తయిన తర్వాత ఆఫ్ చేయాలన్నారు. గ్యాస్ పైపు వాడకంలో సురక్షా ట్యూబ్ లనే వాడాలని, ఎప్పటికప్పుడు లీకేజీల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సిలిండర్ వినియోగంలో ఏదైనా సమస్య ఉంటే 1906 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందాలన్నారు. జాగ్రత్తలు పాటించడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగవని స్పష్టం చేశారు. ఈ వంటల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన పొలాస స్వప్నరాజేందర్ ను నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, కమిషనర్ లావణ్య, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుమల స్వరూప, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, నిర్వాహకులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ వొజ్జల కిషోర్, గడ్డం వేణు, గంప బాలకృష్ణ, దామోదర్ రావు, గోపాల్, శివ ప్రసాద్, రవి, రాజేందర్, బాలు, దేవయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.













# భారత్ తుది జట్టులో మూడు మార్పులు ఖాయం: గావస్కర్

**కాన్‌బెరా:** బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో తొలి టెస్టులో ఘన విజయం సాధించి ఊపుమీదున్న టీమ్‌ఇండియా.. రెండో మ్యాచ్‌కు సన్నద్ధమవుతోంది. డిసెంబరు 6న అడిలైడ్ వేదికగా ఆరంభమయ్యే రెండో టెస్టు డే/నైట్‌లో, గులాబీ బంతితో జరగనుంది. దీంతో మ్యాచ్‌పై మరింత ఆసక్తి పెరిగింది. మరోవైపు, రెండో టెస్టు కోసం భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశముంది. తొలి మ్యాచ్‌కు దూరమైన రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ రెండో టెస్టులో ఆడటం ఖాయం. ఈ నేపథ్యంలోనే భారత దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ఆసీస్‌తో రెండో టెస్టు కోసం తుది జట్టు ఎలా ఉండనుందో అంచనా వేశాడు. రోహిత్, గిల్ రాకతో దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ ప్లేయింగ్ ఎలెవన్ నుంచి బయటకివస్తారని పేర్కొన్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా మార్పులు జరిగే అవకాశముందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు. 'కచ్చితంగా రెండు మార్పులు ఉంటాయని నేను భావిస్తున్నాను. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ తుది జట్టులోకి వస్తారు. బ్యాటింగ్ ఆర్డర్ కూడా మార్పులు ఉంటాయనుకుంటున్నా. కేఎల్ రాహుల్ స్థానంలో రోహిత్, మూడో స్థానంలో శుభ్‌మన్ గిల్ వస్తారు. పడిక్కల్, జురెల్ ప్లేయింగ్ ఎలెవన్ నుంచి బయటకు వెళ్తారు. రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. మూడో మార్పు ఏంటంటే వాషింగ్టన్ సుందర్ ప్లేస్‌లో రవీంద్ర జడేజా తుది జట్టులోకి వస్తాడు' అని గావస్కర్ పేర్కొన్నాడు.

**ఆసీస్‌తో రెండో టెస్టు:**
**సునీల్ గావస్కర్ అంచనా వేసిన**
**భారత్ తుది జట్టు**

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.



## టెస్టు క్రికెట్.. సచిన్ రికార్డును
# బ్రేక్ చేసిన జో రూట్

**క్రైస్ట్‌చర్చ్:** ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ మరో ఘనత అందుకున్నాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు (1630) చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతకు ముందు ఈ రికార్డు సచిన్ తెందూల్కర్ (1625 పరుగులు) పేరిట ఉండేది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో రూట్ 23 పరుగులు చేసి ఈ ఫీట్ సాధించాడు. సచిన్ 60 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత అందుకోగా.. జో రూట్ కేవలం 49 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటివరకు 150 టెస్టులు ఆడిన అతడు.. 12,777 పరుగులు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎక్కువ రన్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఇంగ్లాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం 155/6 స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కివీస్.. 254 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్ (84; 167 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) పదో వికెట్‌గా వెనుదిరిగాడు. న్యూజిలాండ్ నిర్దేశించిన 104 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 12.4 ఓవర్లలోనే ఛేదించింది. జాకబ్ బెథెల్ (50*; 37 బంతుల్లో), బెన్ డకెట్ (27; 18 బంతుల్లో), జో రూట్ (23*; 15 బంతుల్లో) పరుగులు చేశారు.

# హైబ్రిడ్‌కు ఒప్పుకొంటాం కానీ..

**దుబాయ్:** ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి ససేమిరా అంటూ వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఎట్టకేలకు దిగి వచ్చింది. పాక్‌లో పర్యటించడానికి భారత్ నిరాకరిస్తున్న నేపథ్యంలో ఐసీసీ చెప్పినట్లే ఆ జట్టు మ్యాచ్‌లను తటస్థ వేదికలో నిర్వహించేలా హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తామని పీసీబీ తాజాగా పేర్కొంది. కానీ ఈ విషయంలో పాక్ బోర్డు ఓ మెలిక పెట్టింది. భవిష్యత్తులో తమ జట్టు కూడా ఐసీసీ టోర్నీల కోసం భారత్‌కు వెళ్లకూడదని నిర్ణయిస్తే.. ఆ మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించేలా తమకు హామీ ఇవ్వాలని పేర్కొంది. ''దీని గురించి ఎక్కువ మాట్లాడాలని అనుకోవట్లేదు. దాని వల్ల పరిస్థితి సంక్లిష్టంగా మారుతుంది. ఐసీసీకి భారత్ తన విధానాన్ని చెప్పింది కాబట్టి మేం కూడా మాది చెబుతాం. ఏం చేసినా ఇద్దరికీ ప్రయోజనం చేకూరేలా ఉండాలి. క్రికెట్ గెలవాలి. అందరికీ గౌరవం దక్కాలి. మేం ఆట మంచి కోసం ఏదైనా చేయడానికి సిద్ధం. కానీ పాకిస్థాన్ ప్రతిష్ట చాలా ముఖ్యమైన విషయం. ఏ నిర్ణయమైనా రెండు జట్లకూ సమానంగా ఉండాలి. వాళ్లు మా దేశానికి రాకుండా.. మేం కచ్చితంగా అక్కడికి వెళ్లాలంటే కుదరదు'' అని పీసీబీ ఛైర్మన్ మోసిన్ నక్వీ తెలిపాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిమార్చి నెలల్లో ఛాంపియన్స్ ట్రోఫీ2025 జరగాల్సి ఉంది. మొన్నటిదాకా హైబ్రిడ్ పద్ధతికి తాము ఒప్పుకోమని పీసీబీ చెబుతూ వచ్చింది. అయితే ఈ పద్ధతికి అంగీకరించకుంటే టోర్నీని మరో దేశానికి తరలిస్తామని ఐసీసీ స్పష్టం చేయడంతో పీసీబీ నిర్ణయాన్ని మార్చుకుంది. 2026లో టీ20 ప్రపంచకప్, 2029లో ఛాంపియన్స్ ట్రోఫీ, 2031లో వన్డే ప్రపంచకప్‌లకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఐసీసీ వార్షిక ఆదాయంలో తమ వాటాను పెంచాలని కూడా పీసీబీ డిమాండ్ చేస్తోంది. మరి పాక్ ప్రతిపాదనపై ఐసీసీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# మళ్లీ డ్రానే



**సింగపూర్:** ప్రతిష్ఠాత్మక ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో గేమ్ డ్రాగా ముగిసింది. శనివారం అయిదో రౌండ్లో భారత యువ సంచలనం దొమ్మరాజు గుకేశ, డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) 40 ఎత్తుల తర్వాత పాయింట్ పంచుకున్నారు. ఈ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన 18 ఏళ్ల గుకేశ్.. కింగ్స్ పాన్ ఓపెనింగ్‌తో మొదలెట్టి, ఫ్రెంచ్ డిఫెన్స్ ఎదుర్కొన్నాడు. కానీ ఆరంభ ఎత్తుల తర్వాత రక్షణాత్మక ధోరణి ప్రదర్శించాడు. ఎందుకంటే ఈ పోరు తొలి గేమ్‌లో ఇలాంటి ఆరంభ ఎత్తుల తర్వాత తడబడ్డ గుకేశ్ ఓటమి పాలయ్యాడు. అందుకే ఈ సారి ఆ తప్పిదం చేయకుండా జాగ్రత్తగా పావులు కదిపాడు. మరోవైపు ఈ టైటిల్ సమరంలో 32 ఏళ్ల లిరెన్ తొలిసారి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడాడు. గుకేశ్‌ను సమస్యల్లోకి నెట్టి విజయం సాధించాలనుకున్నాడు. కానీ మధ్యలో రూక్ విషయంలో ఓ పొరపాటు చేసినప్పటికీ మళ్లీ పుంజుకున్న భారత గ్రాండ్‌మాస్టర్ ప్రత్యర్థికి ఆ అవకాశం ఇవ్వలేదు. ఇద్దరూ పావులను త్యాగం చేస్తూ సాగడంతో పోరు డ్రాగా ముగుస్తుందని ముందే స్పష్టమైంది. కానీ నిబంధనల ప్రకారం డ్రా అయ్యే పక్షంలో కనీసం 40 ఎత్తులు వేయాలి. దీంతో అవి పూర్తవగానే ఇద్దరు ఆటగాళ్లు కరచాలనం చేశారు. ఈ పోరులో అయిదు గేమ్‌లు పూర్తయ్యే సరికి గుకేశ్, లిరెన్ 2.5 2.5తో సమానంగా ఉన్నారు. ఈ పోటీలో మరో 9 రౌండ్లు మిగిలి ఉన్నాయి. మొదట 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలుస్తాడు. ఆదివారం ఆరో గేమ్‌లో గుకేశ్ నల్లపావులతో ఆడబోతున్నాడు.

**ధోని, జకోవిచ్ అంటే ఇష్టం**

చెస్ కాకుండా ఇతర ఆటల్లో భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని, టెన్నిస్ అగ్రశ్రేణి ఆటగాడు జకోవిచ్‌ను అభిమానిస్తానని గుకేశ్ చెప్పాడు. ''చిన్నప్పుడు నేను ధోనిని ఆరాధించేవాణ్ని. ఇప్పుడు జకోవిచ్‌ను అభిమానిస్తున్నా. ఈ ఇద్దరూ గొప్ప అథ్లెట్లు. చాలా విషయాల్లో వీరిని ఆరాధిస్తా. ఈ పోటీల్లో ఒక్కో గేమ్‌పై దృష్టి పెడుతూ సాగుతున్నా. ఈ పోరులో ఇంకా సగం రౌండ్లు కూడా పూర్తి కాలేదు. ముఖ్యమైన గేమ్‌లు రాబోతున్నాయి. తొలి గేమ్‌లో ఓడిపోయిన తర్వాత కూడా ఇప్పుడీ స్థితిలో ఉన్నందుకు సంతోషంగా ఉంది. ఈ గేమ్ ఎలాగో డ్రా అవుతుందని తెలుసు. కానీ మధ్యలో ఆ పొరపాటు ఎలా జరిగిందో అర్థం కాలేదు. ఆ తర్వాత పుంజుకున్నా. గేమ్ మధ్యలో కళ్లు మూసుకోవడం అలవాటు. ఆ సమయంలోనే ఎత్తుల గురించి లెక్కలేసుకోవడం సులువుగా ఉంటుంది'' అని చెన్నైకి చెందిన గుకేశ్ తెలిపాడు.




# ఫైనల్లో సింధు, లక్ష్య

**లక్నో:** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అదరగొడుతోంది. టైటిళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించేందుకు అడుగు దూరంలో నిలిచింది. సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె ఫైనల్ చేరింది. శనివారం మహిళల సింగిల్స్ సెమీస్‌లో టాప్‌సీడ్ సింధు 21 12, 219 తేడాతో 17 ఏళ్ల ఉన్నతి హుడాను చిత్తుచేసింది. మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 36 నిమిషాల్లోనే మ్యాచ్ ముగించింది. స్మాష్‌లు, క్రాస్ కోర్టు షాట్లతో సాగిపోయిన సింధు తొలి గేమ్ ఆరంభంలోనే 53తో ఆధిక్యం సాధించింది. అదే ఊపు కొనసాగించి వరుసగా రెండు గేమ్‌లు నెగ్గింది. ఆదివారం ఫైనల్లో వూ యు (చైనా)తో సింధు తలపడుతుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ తుదిపోరుకు అర్హత సాధించాడు. సెమీఫైనల్లో అతను 218, 2114తో ఒగావా (జపాన్)ను ఓడించాడు. టైటిల్ కోసం హెంగ్ (సింగపూర్)తో లక్ష్య పోటీపడనున్నాడు. మరో సెమీస్‌లో హెంగ్ 2113, 2119తో ప్రియాన్షుపై గెలిచాడు. మహిళల డబుల్స్‌లో రెండో సీడ్ గాయత్రి గోపీచంద్ ట్రీసా 1821, 2118, 2110తో బెన్యాపా నుంతకర్ణ్ (థాయ్‌లాండ్)పై, మిక్స్‌డ్ డబుల్స్‌లో అయిదో సీడ్ తనీషా ధ్రువ్ 2116, 2115తో జి హాంగ్ జియా యాంగ్ (చైనా)పై, పురుషుల డబుల్స్‌లో పృథ్వీ ప్రతీక్ 2117, 1721, 2116తో ఇషాన్ శంకర్‌ప్రసాద్‌పై గెలిచి తుదిపోరు చేరారు. మహిళల డబుల్స్‌లో టాప్‌సీడ్ తనీషా అశ్విని ద్వయానికి మాత్రం సెమీస్‌లో చుక్కెదురైంది. ఈ జంట 2114, 1621, 1321తో జింగ్ క్వియాన్ (చైనా) చేతిలో ఓడింది.

## రోహిత్ శర్మ కుమారుడి పేరు ఇదే..
# వెల్లడించిన రితికా

టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ సతీమణి రితికా సజ్దే ఆయన అభిమానులకు తీపి కబురు అందించింది. ఇటీవల మగ బిడ్డకు జన్మనిచ్చిన ఆమె.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తమ చిన్నారి పేరును వెల్లడించింది. డిసెంబరులో క్రిస్మస్ వేడుకల సందర్భంగా.. అదే స్టైల్లో కుమారుడి పేరును రితికా వెల్లడించింది. నాలుగు క్రిస్మస్ బొమ్మలపై తమ పేర్లతో పాటు చిన్నారి పేరు కూడా రాసి ఉన్న ఫొటోను షేర్ చేసింది. తమ రెండో బిడ్డకు 'అహాన్' అని నామకరణం చేసినట్లు తెలుస్తోంది. రితికా పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'హిట్ మ్యాన్ కుమారుడి పేరు చాలా బాగుంది''.. ''మా చిట్టి హీరో ఫొటోను కూడా పంచుకోండి.. ప్లీజ్'' అంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు. కాగా.. రితికాను రోహిత్






# విజయ్ పోరాడినా.. టైటాన్స్ ఓటమి

**నోయిడా:** ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి ఎదురైంది. కెప్టెన్ విజయ్ మలిక్ (17) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటినా జట్టును గెలిపించలేకపోయాడు. శనివారం మ్యాచ్‌లో టైటాన్స్ 2841 తేడాతో జైపూర్ పింక్‌పాంథర్స్ చేతిలో చిత్తయింది. ద్వితీయార్ధంలో తడబాటు టైటాన్స్‌కు చేటు చేసింది. మ్యాచ్ ఆరంభంలో జైపూర్‌కు టైటాన్స్ గట్టి పోటీనిచ్చింది. రైడింగ్‌తో పాటు ట్యాక్లింగ్‌లోనూ విజయ్ సత్తాచాటాడు. మరోవైపు ప్రత్యర్థి కూడా పాయింట్ల వేటలో సాగిపోవడంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి రెండు జట్లు 1818తో నిలిచాయి. కానీ విరామం తర్వాత జైపూర్ జోరు ముందు టైటాన్స్ తేలిపోయింది. విజయ్‌కు సహకారం కరువైంది. జైపూర్ జట్టులో నీరజ్ (12), కెప్టెన్ అర్జున్ (11) చెలరేగారు. దీంతో రెండు సార్లు ఆలౌటైన టైటాన్స్ తిరిగి పుంజుకోలేక ఓటమి వైపు నిలిచింది. మరో



మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 5429తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. దేవాంక్ (17), అయాన్ (13) పట్నా విజయంలో కీలక పాత్ర పోషించారు.

# భారత్ ఆల్‌రౌండ్ షో.. ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌పై ఘన విజయం

**కాన్‌బెరా:** ఆస్ట్రేలియాతో డే/నైట్ టెస్టు ముంగిట ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌తో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గులాబీ బంతితో జరిగిన ఈ మ్యాచ్‌ను 50 ఓవర్ల చొప్పున నిర్వహించాలనుకున్నారు. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వరుణుడు అంతరాయం కలిగించడంతో 46 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సామ్ కాన్‌స్టస్ (107; 97 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదాడు. 241 పరుగుల లక్ష్యాన్ని భారత్ 42.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇది ప్రాక్టీస్ మ్యాచ్ కాబట్టి మిగిలిన 3.1 ఓవర్లలో కూడా భారత్ బ్యాటింగ్ చేసింది. 46 ఓవర్లలో భారత్ 257/5 స్కోరు చేసింది.

బౌలింగ్‌లో అదరగొట్టిన టీమ్‌ఇండియా.. బ్యాటింగ్‌లోనూ సత్తాచాటింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (45; 59 బంతుల్లో 9 ఫోర్లు), కేఎల్ రాహుల్ (27 రిటైర్డ్ హర్ట్; 44 బంతుల్లో 4 ఫోర్లు) శుభారంభం అందించారు. తర్వాత వచ్చిన శుభ్‌మన్ గిల్ (50 రిటైర్డ్ హర్ట్; 62 బంతుల్లో 7 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (42; 32 బంతులలో 5 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (42*; 36 బంతుల్లో 5 ఫోర్లు), రవీంద్ర జడేజా (27; 31 బంతుల్లో) రాణించారు. నాలుగో స్థానంలో వచ్చిన కెప్టెన్ రోహిత్ (3) మాత్రం నిరాశపర్చాడు. కోహ్లీ బ్యాటింగ్‌కు దిగలేదు. ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ బౌలర్లలో చార్లీ ఆండర్సన్ 2, లాయిడ్ పోప్, రెన్‌షా చెరో వికెట్ పడగొట్టారు. డిసెంబరు 6 నుంచి భారత్, ఆసీస్ మధ్య రెండో టెస్టు (పింక్ బాల్ టెస్టు) ప్రారంభంకానుంది. డే/నైట్ జరిగే ఈ మ్యాచ్‌కు అడిలైడ్ ఓవల్ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ బ్యాటర్లలో కాన్‌స్టస్‌తోపాటు తొమ్మిదో స్థానంలో వచ్చిన హన్నో జాకబ్స్ (61; 61 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జాక్ క్లేటన్ (40; 52 బంతుల్లో 6 ఫోర్లు) రాణించాడు. భారత బౌలర్లలో యువ పేసర్ హర్షిత్ రాణా (4/44) అదరగొట్టాడు. ఆకాశ్ దీప్ 2, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు.



# ఆవిసె గింజలు తింటే.. అద్భుతాలు



ప్రస్తుతం ఆరోగ్యంపై చాలా మందికి అవగాహన పెరుగుతోంది. దీంతో తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పడుతున్నారు. ఇందులో భాగంగానే రెగ్యులర్ ఫుడ్‌తో పాటు ఆరోగ్యానికి మేలు చేసే సీడ్స్‌ను తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి సీడ్స్‌లో ఆవిసె గింజలు ఒకటి. ఇందులోని ఎన్నో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతీ రోజూ ఒక స్పూన్ ఆవిసె గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో వచ్చే మార్పులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

అవిసె గింజల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్,, థయామిన్, కాపర్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా చేస్తాయి. అలాగే ఇందులోని బి కాంప్లెక్స్ విటమిన్లు, విటమిన్ ఇ, మెగ్నీషియం చర్మ సంరక్షణతో పాటు ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇందులో మెగ్నీసియం రక్తపోటును కంట్రోల్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అంటున్నారు. శరీరంలో రక్త కణాల ఉత్పత్తిలో కూడా అవిసె గింజలు ఉపయోగపడతాయని నిపుణు అంటున్నారు.

ఇక జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కూడా ఇవి బాగా ఉపయోగపడతాయి. దీనికి కారణం ఇందులోని ఫైబర్ కంటెంట్. అవిసె గింజల్లో పుష్కలంగా ఉండే ఫైబర్ కంటెంట్ మెరుగైన జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది. అలాగే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో గుండె ఆరోగ్యానికి ఇది మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. గుండె పోటు వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. ఈ గింజల్లో ఉండే.. యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను అంతం చేస్తాయి. ఫలితంగా కేన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది. డయాబెటిస్ సమస్య బారిన పడకుండా ఉండాలంటే కచ్చితంగా ప్రతీరోజూ అవిసె గింజలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులోని ఫైబర్ కంటెంట్ రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా అడ్డుకుంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్రమం తప్పకుండా వీటిని తీసుకుంటే రెగ్యులర్ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.





# మసాలా టీ.. ఇంట్లోనే చేసుకోండి ఇలా..!

మసాలా టీ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి.. కానీ ఈ టీ తాగాలంటే ఏదైనా ఫేమస్ కేఫ్ కు వెళ్లాల్సిందే. అది కూడా జనం అరుపులు, కేకలు వింటూ తాగాలి. ఇంట్లోనూ మనం నిత్యం టీ చేసుకొని తాగుతాం.. కానీ మసాలా టీ( అల్లంటీ) లాంటి రుచి ఇంట్లో చేసుకుంటే రాదు. అయితే ఇంట్లోనే అల్లం టీ లేదా మసాలా టీ ఎలా చేసుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. మీరు గనక ఇక్కడ చెప్పినట్టు టీ కాచుకుంటే అచ్చం ఇరానీ టీ టేస్ట్ వచ్చి తీరుతుంది.

## కావాల్సిన పదార్థాలు:

- పావు లీటర్ పాలు
- రెండు టేబుల్ స్పూన్ అల్లం తురుము
- మూడు టేబుల్ స్పూన్ల టీ పొడి
- నాలుగు లవంగాలు
- అయిదు యాలకులు
- రెండు టేబుల్ స్పూన్ల గులాబీ రెబ్బలు
- ఒక చిన్న ముక్క దాల్చినా చెక్క

ముందుగా పెనంపై టీ కాచే గిన్నెను పెట్టుకొని అందులో పాలు పోసి, పాలు ఒక పొంగు వచ్చే వరకు మరిగించుకోవాలి. అనంతరం ఆ పాల గిన్నెను పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఒక చిన్న పాత్ర తీసుకొని అందులో రెండు గ్లాసుల నీళ్లు పోసుకోవాలి. ఆ నీళ్లు కొంచెం మరిగాక.. అందులోనే కచ్చాపచ్చాగా దంచుకున్న యాలకులు, అల్లం తురుము, లవంగాలు, దాల్చిన చెక్కను వేసి కాసేపు మరిగించుకోవాలి. తరువాత బాగా మరిగిన ఆ డికాషన్ లో టీ పొడి, సరిపడా చెక్కర వేసుకొని.. రెండు నిమిషాల పాటు బాగా మరిగించుకోవాలి. డికాషన్ బాగా మరిగిన తరువాత.. ఇందులో మనం ముందుగానే వేడి చేసి పెట్టుకున్న పాలను పోసుకోవాలి. అలాగే రెండు టేబుల్ స్పూన్ల గులాబీ రెబ్బలను కూడా కలుపుకోవాలి. గులాబీ రెబ్బలను టీలో కలుపుకోవడం ద్వారా టీ మంచి రుచిగా ఉండడంతో పాటు చిక్కగా, సువాసన భరితంగా ఉంటుంది. తరువాత స్టవ్ ను మీడియం మంటలో ఉంచుకొని.. గరిటెతో టీని కలుపుతూ అయిదు నిమిషాల పాటు బాగా మరిగించుకోవాలి. అంతే పొగలు కక్కే అల్లం టీ సిద్ధమైపోతుంది.



# బిర్యానీ తింటూ, కూల్ డ్రింక్ తాగుతున్నారా..?



వెడి వెడిగా చికెన్ బిర్యానీ తింటూ.. కూల్‌కూల్‌గా కూల్ డ్రింక్ తాగితే.. అబ్బా ఆ మజానే వేరు అని చాలా మంది భావిస్తుంటారు. బిర్యానీ లాగిస్తూ, కూల్ డ్రింక్ సిప్ చేస్తూ చిల్ అవుతుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. నిజానికి కూల్ డ్రింక్ తాగడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని తెలిసిందే. అందులోనూ బిర్యానీ తింటూ, కూల్ డ్రింక్ తాగడం మరింత మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ కూల్‌డ్రింక్ తాగుతూ.. బిర్యానీ తినడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

* బిర్యానీ తింటూ కూల్ డ్రింక్ తాగితే కడుపులో ఆమ్లత్వం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా బిర్యానీ లాంటి మసాలాలు ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకుంటే కడుపులో గ్యాస్ట్రిక్ యాసిడ్ విడుదలవుతుంది. దానికి తోడు కూల్ డ్రింక్ తీసుకుంటే అందులోని యాసిడ్స్ జీర్ణ వ్యవస్థలో ఆమ్లాన్ని మరింత పెంచుతుంది. దీంతో ఇది గ్యాస్, గుండెలో మంట సమస్యకు దారి తీస్తుందని అంటున్నారు. మొదట్లో బాగానే అనిపించినా దీర్ఘకాలంలో మాత్రం తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది.

* జీర్ణ సంబంధిత సమస్యలకు సైతం ఇది దారి తీస్తుందని నిపుణులు అంటున్నారు. కూల్ డ్రింక్‌లో ఉండే కార్బనేషన్ జీర్ణక్రియపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది అజీర్తి, పొట్టలో నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలకు కారణమవుతుంది.

* మధుమేహంతో బాధపడేవారికి ఇది మరింత ప్రమాదానికి కారణమవుతుంది. బిర్యానీలో ఉండే కార్బోహైడ్రేట్స్, కొవ్వులు.. కూల్ డ్రింక్స్‌లో ఉండే అధిక చక్కెర స్థాయిలు రక్తంలో షుగర్ లెవల్స్ పెరగడానికి కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

* కూల్ డ్రింక్స్‌లో అధిక చక్కెరలు, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి లివర్‌తో పాటు కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బిర్యానీలో ఉన్న ప్రోటీన్లు, కొవ్వులు శరీరానికి అధిక శక్తిని ఇస్తాయి. కూల్ డ్రింకులతో పాటు తీసుకోవడం వలన శరీరంలో టాక్సిన్ లు ఎక్కువ అవుతాయి, ఇది కాలేయంతో పాటు కిడ్నీ పనితీరును ప్రభావితం చేస్తుంది.


* కూల్ డ్రింక్స్‌లో అధికంగా ఉండే చక్కెరలు, కేలరీలు శరీరంలో కొవ్వు పెరగడానికి కారణమవుతాయి. అలాగే బిర్యానీలోని కొవ్వు ఒబేసిటీ, అధిక రక్తపోటుకు దారి తీస్తాయి. దీర్ఘకాలంలో ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగటానికి దారితీస్తుంది. దీంతో గుండె సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి.



# ‘లూసిఫర్ 2’ షూట్ పూర్తి.. నటుడి పోస్ట్



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ ‘లూసిఫర్’. 2019లో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకు కొనసాగింపుగా ‘లూసిఫర్2: ఎంపురాన్ (రాజు కన్నా గొప్పవాడు)’ సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈసినిమా షూట్ పూర్తైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మోహన్‌లాల్ తాజాగా పోస్ట్ పెట్టారు.“సినిమా చిత్రీకరణ ముగిసింది. 14 నెలల సమయం.. ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్, యూకే, యూఏఈ సహా దాదాపు నాలుగు దేశాలు.. ఇదొక అద్భుతమైన ప్రయాణం. ప్రతి ఫ్రేమ్‌ని ఎలివేట్ చేసే సృజనాత్మకత పృథ్వీరాజ్ సుకుమారన్ సొంతం. స్క్రీన్ ప్లేతో ఈ కథకు ప్రాణం పోసిన మురళీ గోపీ, మాపై నమ్మకం ఉంచి ఎంతోగానో సపోర్ట్ చేసిన నిర్మాతలకు ధన్యవాదాలు. నటీనటులు, టెక్నికల్ టీమ్ సమష్టి సహకారంతోనే మేము దీనిని సాధించగలిగాం. మమ్మల్ని ఎంతగానో ఆరాధించే అభిమానుల ప్రేమే.. మాపై స్ఫూర్తి పెంచింది’’ అని పేర్కొన్నారు. మరెన్నో విశేషాలు వెలువడనున్నాయని చెప్పారు.‘లూసిఫర్’కు ప్రీక్వెల్ కమ్ సీక్వెల్ ఈ సినిమా రూపుదిద్దుకుంది. పృథ్వీరాజ్ సుకుమార్, మంజు వారియర్, టొవినో థామస్ కీలక పాత్రలు పోషించారు. గతేడాది అక్టోబర్‌లో ఈ సినిమా షూట్ ప్రారభమైంది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై ఇది నిర్మితమైంది. వచ్చే ఏడాది మార్చి 27న ఇది విడుదల కానుంది.



### ‘ఓజీ’ అప్‌డేట్ కావాలన్న నెటిజన్..

## నిర్మాణ సంస్థ ఏమందంటే..?

పవన్‌కల్యాణ్ హీరోగా డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోన్న చిత్రం ‘ఓజీ’. సుజీత్ దర్శకుడు. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలోనే దీనికి సంబంధించిన అప్‌డేట్స్ తెలుసుకునేందుకు పవన్ అభిమానులు ఆసక్తి కనబరుస్తున్నారు. అప్‌డేట్స్ ఇవ్వమంటూ తరచూ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్‌స్‌ను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు.ఈ క్రమంలోనే తాజాగా ఓ సరదా సంభాషణ చోటుచేసుకుంది. అప్‌డేట్ కోరుతూ ఓ నెటిజన్.. “ఓజీ అప్‌డేట్ ఇచ్చి చావు” అని పోస్ట్ పెట్టాడు. దీనిపై నిర్మాణ సంస్థ స్పందించింది. “అప్‌డేట్‌లు ఇవ్వకుండా చావనులే. ఉన్నప్పుడు ఇస్తా. ప్రస్తుతానికి సీజ్ ది షిప్” అని రిప్లై ఇచ్చింది. మరో పోస్టులో “(అప్‌డేట్ కావాలంటూ ఇబ్బందిపెడుతున్నారనే ఉద్దేశం వచ్చేలా) మీరేంట్రా వారానికి ఒకసారి” అని పేర్కొంది. కాకినాడ పోర్టులో పవన్‌కల్యాణ్ అన్న ‘సీజ్ ది షిప్’ ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. ఆ మాటలను కూడా ఈ సినిమాలో ఉపయోగించమని పలువురు అభిమానులు కోరుతున్నారు.గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా ‘ఓజీ’ తెరకెక్కుతోంది. ప్రియాంకా మోహన్ హీరోయిన్. శ్రియారెడ్డి కీలక పాత్రలో కనిపించనున్నారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ విలన్‌గా కనిపించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య దీనిని నిర్మిస్తున్నారు. తమన్ స్వరాలు అందిస్తున్నారు. శింబు ఈ సినిమాలో స్పెషల్ సాంగ్ పాడనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి.

## హైదరాబాద్‌లో బుల్లితెర నటి శోభిత ఆత్మహత్య



కన్నడ బుల్లితెర నటి శోభిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. గచ్చిబౌలి శ్రీరాంనగర్ కాలనీలోని సీ బ్లాక్‌లో ఉన్న ఆమె.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులకు సమాచారం అందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన గచ్చిబౌలి పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బ్రహ్మగంతు, నినిదలే సీరియల్స్‌తో పాటు పలు సినిమాల్లో నటించిన శోభిత.. గతేడాది వివాహం చేసుకున్నారు. భర్త సుధీర్‌తో కలిసి శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బెంగళూరు తరలించనున్నట్టు సమాచారం.

## పదహారణాల అచ్చ తెలుగందం



తెలుగు తెరకు అచ్చతెలుగు అమ్మాయిల రాక తక్కువే. ఇలాంటి తరుణంలో ఓ తెలుగు అందాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు ప్రముఖ దర్శకుడు వై.వి.ఎస్.చౌదరి. నందమూరి హరికృష్ణ మనవడు, జానకి రామ్ కుమారుడు తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ వైవీఎస్ ఓ సినిమాని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని ఆయన సతీమణి గీత యలమంచిలి నిర్మిస్తున్నారు. కీరవాణి సంగీతమందిస్తున్నారు. ఈ చిత్రంతో తెలుగమ్మాయి వీణారావు నాయికగా వెండితెరకు పరిచయం కానుంది. ఈ మేరకు ఆమె ఫస్ట్‌లుక్‌ను నిర్మాతలు స్వప్నదత్, సుప్రియ యార్లగడ్డ శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం నిర్మాత స్వప్నదత్ మాట్లాడుతూ.. “వీణా మా విజయవాడ అమ్మాయి. చాలా అందంగా కనిపిస్తోంది. తెలుగమ్మాయిలు హీరోయిన్స్‌గా రావాల్సిన సమయమిది. ఈ విషయంలో చౌదరి అన్న ఓ అడుగు ముందుకేయడం ఆనందంగా ఉంద’’న్నారు. “కొత్తవాళ్లను చిత్రసీమకు పరిచయం చేయడంలో వైవీఎస్ ముందుంటారు. ఇప్పుడు వీణారావు ఆయన ద్వారా తెరకు పరిచయం కానుండటం ఆమె అదృష్టం. తను ఎన్నో చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా’’ అన్నారు సుప్రియ. దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ.. “నా మనసులో ఎప్పట్నుంచో తెలుగమ్మాయిని పరిచయం చేయాలని కోరిక ఉండేది. ఈ క్రమంలో ఫేస్‌బుక్‌లో వీణా ఫొటోలు నచ్చి ఆమెని ఎంపిక చేసుకున్నా. తను మంచి కూచిపూడి డ్యాన్సర్. అందాల రాశి. ఆమెకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నా. నేను తీసిన ఏ చిత్రంలోనైనా నాయకానాయికలకు సమ ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రంలోనూ అంతే. ఇదొక వైవిధ్యభరితమైన ప్రేమకథతో రూపొందనుంది. ఈ సినిమా కోసం తారక రామారావు 18నెలలుగా ఎంతో కష్టపడుతున్నాడు. ఎన్టీఆర్ తొలి సినిమా వచ్చి 75 ఏళ్లు.. బాలకృష్ణ పరిశ్రమలోకి వచ్చి 50ఏళ్లు అయింది. ఇదే ఏడాది మోక్షజ్ఞ, తారక రామారావులు ఇండస్ట్రీలోకి రానుండటం ఎంతో ప్రత్యేకం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయనున్నాం. దీంట్లో మంచి ప్రేమ గీతాలుంటాయి’’ అన్నారు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657